జానంపేటలో దాహం.. దాహం

- వృథాగా తాగునీటి ట్యాంకులు
- బోరు నీరే దిక్కు
- నేరుగా పైప్‌లైన్లకే భగీరథ నీరు



పెబ్బేరు రూరల్: రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో బోరుబావులు, చేతి పంపుల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. వేసవి ప్రారంభం లోనే శ్రీరంగాపురం మండలంలోని జానంపేటలో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. గ్రామ పంచాయతీ వారు బోరుబావుల నుంచి రోజూ నీటి సరఫరా చేస్తున్నా.. గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నల్లా ద్వారా నీటిని అందించేందుకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెట్టి గ్రామంలో భగీరథ ట్యాంకులను నిర్మిం చారు. రెండు నెలల నుంచి వాటికి కనెక్షన్ లేక నిరుపయోగంగా మారాయి. మిషన్ భగీరథ పైప్ లైన్‌ను ట్యాంక్‌కు కనెక్షన్ ఇవ్వకుండా.. నేరుగా గ్రామంలో ఉన్న పైపులైన్లకే కనెక్షన్ ఇవ్వడంతో దిగువ ప్రాంతం ఇళ్లకు మాత్రమే నీళ్లు వస్తూ, ఎగువ ప్రాంతం ఇళ్లకు చుక్క రాకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు వేడుకున్నా సమస్య పరిష్కారం



నిరుపయోగంగా మిషన్ భగీరథ ట్యాంకు

కావడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తు న్నారు. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే మరో రెండు నెలలు ఎలా అని ప్రజలు ఆందోళన చెం దుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న మినీట్యాంక్

గ్రామ జనాభా	కుటుంబాలు	నీటి ట్యాంకులు
2,100	432	02
మినీ ట్యాంకులు	బోరుబావులు	చేతిపంపులు
03	02	01

‘భగీరథ’ ట్యాంకు నింపాలి



గతంలో మిషన్ భగీరథ ట్యాంక్ నింపి, తర్వాత నీటిని వది లేవారు. ఇప్పుడు ట్యాంకుకు పైపులైన్ కనెక్షన్ ఇవ్వకుండా నేరుగా సరఫరా చేస్తుం డడంతో ఎగువ ప్రాంతాలకు నీటి అంద ట్లేదు. ప్రజలు తాగడానికి రూ.10 పెట్టి ఫిల్టర్ నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోం ది. అధికారులు భగీరథ నీటితో ట్యాంకు లను నింపి, పైప్‌లైన్లకు సరఫరా చేయాలి.

– విజయకుమార్‌రెడ్డి, జానంపేట

ఎగువ ప్రాంతాల్లో ఇబ్బంది



కొన్నిరోజుల నుంచి తాగునీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడే నీటి సర ఫరా సక్రమంగా లేకపోతే ఎం డకాలం మొత్తం ఎలా? గ్రామం లో ఉన్న ట్యాంకులకు నీటిని నింపాలి. లేకపోతే మిట్ట ప్రాంతంలో ఇళ్లకు నీటి సరఫరా ఉండట్లేదు. గతంలో సమస్యను సర్పంచ్‌కు చెప్పుకునే వాళ్లం. ఇప్పుడు ఎవరికి చెప్పాలో కూడా తెలియదు. ప్రజలను పట్టిం చుకునే వారు కరువయ్యారు. అధికారులు ఎండా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్యను పరిష్క రించాలి.

– ఎండీ ఉమర్ ఫారూఖ్ జానంపేట

బోరు బావుల ద్వారా..



జానంపేట గ్రామంలో మిషన్ భగీరథ ట్యాంకులకు నీటి అందించే పైప్‌లైన్లలో ఇబ్బం దులు ఉన్నందున నీటిని డైరెక్టు లైన్‌కు సరఫరా చేస్తున్నారు. గ్రామంలో నిత్యం గ్రామ పంచాయతీ రెండు బోరుబావుల ద్వారా నల్లాలకు నీటిని వదులుతున్నాం. గ్రామం లో ఎగువ ప్రాంతం ఇళలకు నీటి సరఫరా తక్కు వగా ఉంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటి సమస్యను పరిష్కరిస్తాం.

– రవీంద్ర, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, శ్రీరంగాపురం

క్లుప్తంగా

స్నేహితుల ఆర్థిక చేయూత



గోపాల్‌పేట: మండలంలోని ఏదుల ఎంపీటీసీ నరేందర్ కొన్ని రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సోమాజిగూడ లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తనతో పాటు 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన స్నేహితులు సోమవారం హైదరాబాద్‌లో నరేందర్ పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సంద ర్భంగా రూ.నలభై వేల ఆర్థికసాయం అందిం చారు. ఎటువంటి ఇబ్బంది అయినా వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఆర్థికసాయం అందజేత

పెబ్బేరు రూరల్: కొత్తసూగూరుకు చెందిన జైభీమ్ యూత్ వ్యవస్థాపకుడు కేశపాగ సామేలు ఆదివారం అనారోగ్యంతో మృతి చెం దాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ ఆవుల శైలజ రూ.3 వేలు, జైభీమ్ యూత్ సభ్యులు ఆర్థికసాయం సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు వెంకటేష్, జయన్న పాల్గొన్నారు.

హరితహారం మొక్కలకు మంటలు



చిన్నంబావి: మండల కేంద్రం నుంచి కొప్పునూరు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి వెంబడి ఉండే హరితహరం మొక్కలు కాలిపో యాయి. గుర్తు తెలియని వ్యక్తులు పంట పొలాల్లో చెత్తకు నిప్పటించడంతో ఆ మంటలు వ్యాపించి రోడ్డు పక్కల ఉన్న హరితహరం మొక్కలకు వ్యాపించాయని ఎంపీడీఓ రమణ రావు తెలిపారు. రైతులు పంట పొలాల్లో నిప్పటించే క్రమంలో జాగ్రత్తగా వ్యవహరించా లని, మంటలు పూర్తిగా చల్లారే వరకు ఉం డాలని రైతులకు సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో హరితహరం మొక్కలను కాపాడేం దుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పం చాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

కలెక్టర్‌కు వినతి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలం లోని తాటిపాముల గ్రామంలోని మహిళా సం ఘాల్లో పెద్ద ఎత్తున కుంభకోణం జరిగిందని, గ్రామ ఐక్య మహిళా సంఘం అధ్యక్షురాలిపై విచారణ జరిపించాలని సోమవారం కలెక్టర్ తేజస్‌నందులాల్ పవర్‌కు సభ్యులు విన తిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ఓ నాయకుడు ఆమెకు మద్దతు ఇచ్చి మహిళలను ఇబ్బందు లకు గురి చేస్తున్నాడని, మహిళా సంఘాలలో ఆయన పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపిం చారు. దీనిపై కలెక్టర్ స్పందించి డీఆర్‌డీఓతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని అధికా రులకు సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన

చిన్నంబావి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులను కల్పించాలని ఎంపీడీఓ రమ ణరావు పేర్కొన్నారు. మండలంలోని అమ్మాయిపల్లిలో ఉపాధి కూలీలకు సలహాలు, సూచనలు చేశారు. అదేవిధంగా రోజుకు రూ.250 పైగా కూలి వచ్చేలా పనులు చేయాలని ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఎవరైన జాబ్‌కార్డు ఉండి, పనులకు రాని వారికి అవగాహన కల్పించి పనులకు తీసుకురావాని పంచాయతీ సిబ్బం దికి, ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. అనం తరం రికార్డులను పరిశీలించి ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే సంబంధిత అధికారు లపై చర్యలు ఉంటాయన్నారు.

రైతు వ్యతిరేక ప్రభుత్వానికి ఓటమి తప్పదు

ఆత్మకూర్: మతోన్మాదంతో జాతి విద్వేషాలను రెచ్చగొడుతూ పాలన కొనసాగిస్తున్న బీజేపీకి రోజులు దగ్గరపడ్డాయని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండురంగ, మండల ప్రధాన కార్యదర్శి ప్రహ్లాద్, షోషల్ మీడియా ఇన్‌చార్జీ చిరంజీవి అన్నారు. సోమవారం మం డలంలోని బాలకిష్టాపూర్‌లో కిసాన్‌సెల్ కార్య వర్గాన్ని ఏర్పాటు చేశారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృ హంలో జిల్లా కిసాన్‌సెల్ సమావేశం నిర్వహిం చారు. మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా ముం దుకెళ్తున్నామని అన్నారు. అధ్యక్షుడిగా జంగం వెంకటేష్, ఉపాధ్యక్షులుగా శివుడునాయక్, జహంగీర్, ప్రధానకార్యదర్శిగా మొబైల్‌ఖాజ, కోశాధికారిగా శివనాయక్, సభ్యులుగా చాంద్ పాష, మన్యనాయక్, కుమ్మరి శ్రీను, తిరుపతి, బషీర్, నరసింహను ఎన్నుకున్నారు.

ఒకేషనల్ పరీక్షకు ఒకరు గైర్హాజరు

పాన్‌గల్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రంలో సోమవారం జరిగిన ఒకేషనల్ పరీక్షకు ఒక్కరు గైర్హాజరైనట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ తెలి పారు. మొత్తం 77 మంది విద్యార్థులకు 76 మంది హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



మానాజీపేటలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పాండునాయక్, ఎం పీడీఓ వెంకటాచారి, మండల వ్యవసాయ అధికారి మల్లయ్య అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పరిపల్లి, మానాజీపేట, షాపురం, గట్టుకాడిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా ఉండేందుకే ప్రభుత్వం గ్రామాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203 సాధారణ రకం ధాన్యానికి రూ.2,183 మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో త్వరలోనే వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ప్రతి గింజ ప్రభుత్వమే కొం టుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రాం బాబు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



కొత్తకోట రూరల్: పట్టణ శివారులోని ఛత్రపతి చౌరస్తా సమీపంలో హిందూవాహిని, పండ్ల వ్యాపారి సుక్కభాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డాక్టర్ మోహన, డాక్టర్ హరిస్‌రెడ్డి ప్రారంభించారు. వేసవిలో హైవేకు సమీపంలో చలివేంద్రం ఏర్పాటు చేయడంతో వాహనదారులు దాహం తీర్చుకునేందుకు వీలుంటుందని డాక్టర్లు అన్నారు. వేసవి కాలం పూర్తయ్యే వరకు చలివేంద్రాన్ని కొనసాగి స్తామని నిర్వాహకులు తెలిపారు.

ఉపాధి కూలీలకు వేసవి అలవెన్సులు ఇవ్వాలి

అమరచింత: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేసవి అలవెన్సులు ఇవ్వాలని వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో సోమవారం ఉపాధి కూలీలను కలిసి వారి సమస్య లను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో తప్పనిసరిగా టెంట్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్ అమలు చేయాలని కోరారు. తాగు నీటి వసతి, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉం చాలన్నారు. కూలీలకు ఆరు వారాలుగా కూలీ డబ్బులు రాలేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా



కూలీలతో మాట్లాడుతున్న అజయ్

జాబ్‌కార్డు కలిగిన కుటుంబానికి ఏడాదికి రూ.12 వేల చెల్లిస్తామని ప్రకటించిందని, వీటిని వెంటనే అమలు పర్చాలని విజ్ఞప్తి చేశారు. జాబ్‌కార్డు కలిగిన కూలీలకు రూ.ఐదు లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శంకర్, బుర్రల అంజి, రాజేశ్వర్‌రెడ్డి, చిన్న నాగన్న, పద్మ, అనంతమ్మ, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని కేశంపేట పాతతండాలో నిర్వహించిన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో సోమవారం వ్యవసాయశాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు స్థానిక బీఆర్‌ఎస్ నాయ కులు స్వాగతం పలికి సన్మానం చేశారు. దేవా లయాల నిర్మాణం ప్రజల్లో పెరిగిన భక్తికి, సం స్కృతికి నిదర్శనమన్నారు.

చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రజలు ఆదరిస్తారు

వనపర్తి టౌన్: చిత్తశుద్ధితో పనిచేసిన వారిని ప్రజలు గొప్పగా ఆదరిస్తారని సాహితీ కళావే దిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు 32ఏళ్ల విద్యుత్ శాఖలో ఏఏఈగా పనిచేసి పదవి విరమణ చేసిన కొం డారెడ్డిని, ఆయన సతీమణి ప్రధానోపాధ్యా యురాలు ఉమాదేవిని సోమవారం సాహితీ కళావేదిక ప్రతినిధులు ఆయన స్వగృహంలో పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, ఎస్. చంద్రశేఖర్, గణేష్ కుమార్, మద్దిలేటి, మహిపాల్ రెడ్డి, గణేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీకే మళ్లీ అధికారం కట్టబెడదాం’

ఆత్మకూర్: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకే మళ్లీ అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని బీజేపీ మక్తల్ అసెంబ్లీ కన్వీనర్ రేచిం త శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జూరాల, మేడేపల్లి గ్రామాల్లో బీజేపీ బూత్‌కమిటీల నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేశారు. ప్రధాని నరేం ద్రమోదీ ఆధ్వర్యంలో భారతదేశం అభివృద్ధి పథం లో పయనిస్తోందని, ఈమారు ఎన్నికల్లో 400 సీట్లు సాధిండమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని, కార్య కర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థి డీకే అరుణ



మాట్లాడుతున్న శ్రీనివాసులు

గెలుపే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజ లకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో నాయ కులు ఆంజనేయులు, రాజు, జయరాజు, లక్ష్మణ్, శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన తప్పనిసరి





పామిరెడ్డిపల్లిలో ఉపాధి కూలీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న శ్రీవాణి,కొత్తపల్లిలో..



షాపురంలో..

కొత్తకోట రూరల్: నేటి సమాజంలో మహిళలకు, ఆడపిల్లలకు చదువు ఎంతో అవసరమని జిల్లా శిశు, మహిళా సాధికార సంస్థ సభ్యురాలు శ్రీవాణి అన్నారు. సోమవారం పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ‘బేటీ బచావో.. బేటీ పడావో’ కార్యక్ర మంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ వివక్ష అనేది కుటుంబం నుంచే మొదలవుతుందని, అమ్మాయి ని, అబ్బాయిని చిన్నప్పటి నుంచి ఎలాంటి వ్యత్యాసం లేకుండా సమాన ఆలోచనలు, అభిప్రా యాలతో పెంచాలని కోరారు. అమ్మాయిలను పెం చే విషయంలోనూ ధైర్యంతో, మంచి ఆలోచనతో పెంచితే ప్రస్తుతం ఎదుర్కొంటున్న నేరాల సంఖ్య తగ్గుతుందని వివరించారు. ఆడపిల్లలకు పౌష్టికా హారం అందించి, ఉన్నత చదువులు చదివిస్తే వారి లక్ష్యాలు చేరుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి జయమ్మ, ఫీల్డ్ అసిస్టెం ట్ ఆనంద్ ఉపాధి కూలీలు తదితరులు ఉన్నారు.

మదనాపురం: మండలంలోని కొత్తపల్లిలో ఉపాధి కూలీలకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుంచి ఔట్రీచ్ వర్కర్ జీవిత, చైల్డ్ లైన్ కేస్ వర్కర్ రవిరాజు బాలల చట్టాలు, వారి హక్కుల గురించి అవగాహన కల్పించారు. అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండకుండా వివాహం చేయరాదని, చేసినా.. ప్రోత్సహించినా వారికి రెం డేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని హెచ్చ రించారు. అమ్మాయిలు అపరిచిత వ్యక్తుల నుంచి జాగ్రత్తగా ఉండాలని, చిన్నారులు వేసవి కాలంలో బావులు, చెరువుల వద్దకు వెళ్లకుండా తగిన జాగ్ర త్తలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్ల లకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి వివరించాలన్నారు. చిన్నారులకు ఏదైనా సమస్య ఏర్పడితే 1098, 181, 100, 112 టోల్ ఫ్రీ నెంబ ర్లకు ఫోన్ చేసి సమాచారం అందివ్వాలని కోరారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే 1986 బాల కార్మిక చట్టం ప్రకారం జైలు శిక్ష, జరిమానా విధిస్తారని హెచ్చరించారు. అమ్మాయిలపై లైంగిక దాడికి పాల్పడినట్లయితే ఫోక్సో యాక్ట్ 2012 ప్రకారం జైలుశిక్ష విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఖిల్లాఘనపురం: బాలల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ రాజేష్‌కుమార్ అన్నారు. సోమవారం మండలం లోని షాపురం గ్రామంలో బాలల హక్కుల పరిరక్ష ణపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సభ్యులు యాదమ్మ, నరేష్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెం టు శ్రీనువాసులు తదితరులు పాలల్గొన్నారు.

బుద్ధారంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



బుద్ధారంలో నీటి సమస్యలపై ఆరా తీస్తున్న ఎంపీడీఓ శేఖర్

గోపాల్‌పేట: మండలంలోని బుద్ధారంలో నీటికి ఇబ్బంది ఉన్న కాలనీలను గుర్తించి వారికి తాగునీరందిస్తామని గోపాల్‌పేట ఎంపీడీఓ శేఖర్ అన్నారు. శని వారం సాక్షి పత్రికలో ‘బుద్ధారంలో తాగునీటి సమస్య’ అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందిం చారు. సోమవారం ఆయన బుద్ధారం పం చాయతీ సెక్రెటరీ రమేష్‌తో కలిసి గ్రామంలోని పలు కాలనీలను సందర్శించారు. ఎక్కడెక్కడ సమస్య ఉందని అడిగి తెలుసుకున్నారు. అవసర మైన చోట పైప్‌లైన్లు ఏర్పాటు చేసి నీటిని అందిస్తామని, మిట్ట ప్రాంతాల్లో ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తామని చెప్పారు.

సాక్షి ఎఫెక్ట్..

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

పాన్‌గల్: త్రిమత ఏకైక గురువు ఆచార్య ప్రబోధానం ద యోగీశ్వరుల వారి జన్మదినం సందర్భంగా మం డలంలోని రేమద్దులలో త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వ ర్యంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు మాట్లాడుతూ.. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారు గొప్ప తత్వవేత్త, ఆధ్యాత్మికంలో చక్రవర్తి అని కొనియాడారు. అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత అను సిద్ధాంతాలు హిందూ మతంలో ఉన్నా యన్నారు. వీటి యొక్క సంపూర్ణత కోసం గురువు త్రైత సిద్ధాతం ప్రతిపాదించి ఆంధ్రప్రదేశ్‌లోని అనం తపురం జిల్లా తాడిపత్రిలో ప్రబోధాశ్రం నెలకొ ల్పారని తెలిపారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగ 16, 17 శ్లోకాలలో ఉన్నదని, దాని ఆధారంగానే శాస్త్రబద్ధంగా త్రైత సిద్ధాంత భగ వద్గీత’ యొక్క ముఖ్య ఉద్దేశమని వివరించారు. కార్యక్రమంలో సేవాసమితి కమిటీ సభ్యులు సురేష్ కుమార్, కృష్ణయ్య, నాగరత్నం, లలిత, ఆదిలక్ష్మి, శివమ్మ, చింటు, లక్ష్మి, పద్మ, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు

వీపనగండ్ల: నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వ హించనున్న బూత్ లెవల్ ఏజెంట్ల రాజకీయ శిక్షణ కార్యక్రమానికి సోమవారం మండలంలోని నాయ కులు అధిక సంఖ్యలో బయలుదేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మల్లు రవిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త పనిచేయాలని, ఎన్నికల విధానంపై అవగాహన కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్యాయాదవ్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎంపీటీసీ ఇంద్రకంటి వెంకటేష్, నాయకులు రఘు నాథ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాజశేఖర్, హుస్సేన్, పెం టయ్య, నరేష్, మల్లేష్, గురుక కురుమయ్య, తిరుపతయ్య, వెంకటేష్, రాజు, మొగులాలి తదిత రులు పాల్గొన్నారు.

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పార్టీ ఆధ్వర్యం లో నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్లు, బూత్ లెవల్ కమిటీ సభ్యులకు నిర్వహించే శిక్షణకు సోమవారం మండలం నుంచి నాయకులు వెంకటే ష్‌నాయుడు, రవికుమార్, రాముయాదవ్, బ్రహ్మయ్య, ప్రజా ప్రతినిధులు, పలువురు కాంగ్రెస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు తరలివెళ్లారు.

చిన్నారులకు బాలామృతం పంపిణీ



శ్రీరంగాపురంలో..



రంగవరం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందజేస్తున్న టీచర్ చంద్రకళ

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ టీచర్లు పౌష్టికాహారం పంపిణీ చేశారు. తూంకుంట, రంగవరం, వీపనగం డ్ల, సంగినేనిపల్లి తదితర గ్రామాల్లో గుడ్లు, బాలా మృతాన్ని లబ్ధిదారులకు అందజేశారు. తూంకుంట మొదటి అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు పుట్టి నరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్య క్రమంలో చంద్రకళ, పారిజాత, మాధవి తదిత రులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రం లోని అంగన్‌వాడీ మూడో కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ మంజులరాణి ఆరోగ్య పోషణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పం చాయతీ కార్యదర్శి నందకిషోర్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పోషక లోపంతో ఇబ్బం దులు పడకుండా చిరు ధాన్యాలతో కూడిన ఆహారం అందించాలన్నారు. రోజూ తీసుకునే ఆహా రంలో పోషక విలువలున్న ఆకుకూరలు, కూర గాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలని వారికి సూచించారు. అనంతరం చిన్నారులకు బాలమృ తం, గుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్ భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాసంలో దివ్యఖురాన్ పఠించాలి



ప్రసంగిస్తున్న అబ్దుల్‌అహ్మద్‌సాహేల్

ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఇదే మాసంలో దివ్యఖురాన్ అవతరించిందని ప్రముఖ ప్రసంగీకులు సయ్యద్ అబ్దుల్‌అహద్‌సాహేల్ అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని డాక్టర్ బ్రహ్మారెడ్డి ప్రజావైద్యశాలలో పవిత్ర రంజాన్ మాసం ప్రాముఖ్యత వివరిస్తు ముస్లీమేతర వైద్యులు, ప్రభుత్వ ఉపాధ్యాయు లతో ధార్మిక సదస్సు నిర్వహించారు. రంజాన్ మాసంలో అధికశాతంలో దాన, ధర్మాలు చేయాలని, నిరుపేదలకు అండగా నిలుస్తూ ఆహార పదార్థాలతో పాటు దుస్తులను పంచి పెట్టాలని సూచించారు. తమ వద్దనున్న సంప దలో 25 శాతం జకాత్ రూపంలో పేదలకు పంచి పెట్టాలని, తరావి నమాజులో ఖురాన్ పఠనం జరుగుతుందని రంజాన్ మాసంలో తరావీ నమా జుకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. కార్య క్రమంలో డాక్టర్ ముజీబుర్‌రహ్మాన్, ఎంఈఓ భాస్కర్‌సింగ్, జమాతేహింద్ జిల్లా అధ్యక్షుడు ఇక్బాల్, వైద్యులు మణివర్ధన్‌రెడ్డి, సిద్ధార్థరెడ్డి, సం దీప్‌రెడ్డి, జీహెచ్‌ఎం బాలరాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విజయ్‌కుమార్, అగ్రీప, రాఘవేందర్, న్యాయవాది అశోక్‌గౌడ్, వాహేద్, అమీర్, అశ్రఫ్, హనీఫ్, స్థానికులు పాల్గొన్నారు.

‘కార్యకర్తలకు అండగా ఉంటా’



మదనాపురం: కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బరోసా ఇచ్చారు. సోమవారం మండలంలోని నెలివిడికి చెందిన దేరి కృష్ణయ్య నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో కొంత సేపు మట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీఆ ర్‌ఎస్ పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైని కుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యాదగిరి, మాజీ సర్పంచు కోట్ల రాములమ్మ, కురుమూర్తి, నాయకులు జయంతమ్మ, విజయేందర్‌రెడ్డి, తిరు పతయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనల తనిఖీలు

ఆత్మకూర్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యం లో వాహనాల తనిఖీలను ముమ్మరంగా చేపడు తున్నామని సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ తెలిపారు. సోమవారం రాత్రి కొత్తకోట వై జంక్షన్ వద్ద చేపట్టిన వాహనాల తనిఖీల్లో 40 బైకులకు, ఐదు కార్లకు, ఐదు ఆటోలకు జరిమానాలు విధిం చినట్లు పేర్కొన్నారు. నగదు తరలింపు చేపట్టేవారు సరైన ఆధారాలు చూపెట్టకుంటే సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఏఎస్ఐ బీచుపల్లి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మద్యం సీజ్

ఆత్మకూర్: అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. సోమవారం ఆత్మకూర్ మండలంలోని ఆరేప ల్లిలో తెలుగు వేణు హోటల్‌లో మద్యం విక్ర యాలు జరుగుతున్నాయని సమాచారం అంద డంతో దాడులు నిర్వహించారు. రూ.మూడు వేలు విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వేణుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చ రించారు.